
# పగ



## వి.వి.సత్యప్రసాద్

**'అబ్బర్డ్! పిచ్చి వెధవలంతా కారు మీద రాళ్లేసి కొడుతుంటే మిగతా వాళ్లందరూ చూస్తూ ఊరుకున్నారా?' అంత సేపూ వినయంగా, జాగ్రత్తగా మాట్లాడిన డ్రైవర్ శీనయ్య నా దబాయింపుకి కోపం తెచ్చుకున్నాడు.**

'అదేంటి సార్, అలా విరుచుకుపడతారు? పెట్రోలు కోసం పెట్రోలు బంకు దగ్గర కారు ఆపుజేశానండీ! ఆ బంకునే తగలెట్టేస్తాం అంటూ ఇరుసుకుపడిపోయారండీ నాయాళ్లు! ఆ పెట్రోలు బంకోళ్లూ, ఈళ్లూ మాటా మాటా రెచ్చిపోయారండి. బంకు మీద రాళ్లు ఇసరడం మొదలెట్టారండి. మద్దిన మన కారు కూ్కాడా రాళ్ల దెబ్బలు తగిలాయండి. అద్దాలిరిగిపోయాయి. డోర్లన్నీ డెంటింగ్ చేయించాల. సక్రాల్లో గాలి తీసేశారండి.'

ఒక్క క్షణం ఆగి నాకేసి తీవ్రంగా చూశాడు. ఇప్పుడేం చేయమంటారో చెప్పండి అని అడిగినట్టున్నాయి వాడి వాడి చూపులు. హెడ్ క్వార్టర్స్ నుండి నూట యాభై కిలోమీటర్ల దూరం వచ్చి ఈ పల్లెటూరి బ్రాంచిలో చిక్కడిపోయాను. నన్ను ఈ పల్లెటూళ్లో దింపి, నా ఇన్స్పెక్షన్ పూర్తయ్యేలోగా పెట్రోలు కొట్టించుకు వస్తానని ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న టౌనుకి కారుని తీసుకుపోయాడు శీనయ్య. ఇప్పుడు కారు తీసుకురాకుండా ఒక్కడే వచ్చి కారు డేమేజి అయిపోయిందని చల్లగా చెప్పాడు దుర్వార్త!

'నే మళ్లీ ఎనక్కెళ్లి కారు దగ్గరే ఉండి అన్నీ

సరి జేసుకు రావాల. ఆ పన్లన్నీ ఇయాల్టికి తెమలవు. రేపు మద్ద్యాన్నం దాకా ఉండాల్సిందే! తమరి కీ మాట సెబుదారని వచ్చాను. నేను పొరెల్లిపోతన్న.'

నా నుండి ఏ మాటా వినకుండానే వెనుదిరిగిపోయాడు శీనయ్య.

డామిట్! ఎంతలో ఎంత మార్పు వచ్చేసింది? అసలు ఇక్కడి పరిస్థితులెలా ఉన్నాయో తెలుసుకోకుండా ఈ బ్రాంచి ఇన్‌స్పెక్షన్‌కి రావడం నాదే బుద్ధి పొరపాటు. సాయంత్రానికల్లా జోనల్ ఆఫీసుకు వచ్చేస్తాననీ, ఫైల్సన్నీ చూస్తాననీ చీఫ్ మేనేజర్స్‌తో చెప్పాను. నే వచ్చేదాకా వెయిట్ చెయ్యండని ఆర్డర్స్ వేసి మరీ వచ్చాను. వాళ్లకి కమ్యూనికేషన్ పంపాలంటే ఈ వెధవ పల్లెటూరి బ్రాంచి ఫోనుకు ఎస్‌టిడి కూడా లేదు. ట్రంకాల్స్ అసలే రావు, వచ్చినా వినబడి చావదు.

నా నిస్సహాయ పరిస్థితికి నాకే విపరీతమైన చిరాకు పెరిగిపోయింది. అసహనంగా అటూ ఇటూ దిక్కులు చూస్తున్నాను.

బ్రాంచి మేనేజరు ఏం చెయ్యాలో తోచక ఏదో దీర్ఘాలోచనలో ఉన్నట్టు పైడు కిటికీలోంచి శూన్యంలోకి చూస్తున్నాడు.

పక్కనున్న పట్నం నుండి మరో కారు తెప్పించుకుని పోదామనుకుంటే అక్కడ మొత్తం బంద్ పాటిస్తున్నారు. చాలా అల్లర్లు, బోలెడు గొడవలు జరుగుతున్నాయి. జనం ఎవరూ బయటికి కదలడం లేదని వార్తలొస్తున్నాయి.

ఈ బ్రాంచి మేనేజరుని ఏమైనా ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చెయ్యమని అడగడానికి నాకు అహం అడ్డు వస్తోంది. వాడన్నా, వాడి మొహం అన్నా నాకు పరమ ఎలర్జీ. ఒకానొకప్పుడు వీడు నా పై అధికారి (డి.జి.ఎం.)కి పెద్ద చెంచా! ఇప్పుడు నా పరిధిలో ఉన్న బ్రాంచి మేనేజరుగా నా గుప్పిట్లో చిక్కాడు. ఇన్నాళ్లూ వీడూ, వీడి ఫీల్డాఫీసరూ పంపిన ప్రపోజల్సన్నీ ఏవో కుంటి కొర్రీలు, పిచ్చి కొర్రీలు వేసి వెనక్కి తిప్పేసి ఏడిపిస్తూ వచ్చాను. ఇప్పుడు వీడి మీద ఆధారపడినట్టు తెలిస్తే ఎంత లోకువైపోతాను? ఒక రీజనల్ మేనేజరుగా నాలో ఉన్న అహం మరింత ప్రకోపించింది.

మనస్సు మరింత అస్తిమితం అయిపోయింది. నాలో ఇంత చిరాకు పెరిగిపోవడానికి - కారు చెడిపోవడం ఒకటే కారణం రాదు, పొద్దుట నుంచి తిండి లేక ఎండిపోయిన కడుపు కూడా ఒక కారణం. అక్కడక్కడా తాగిన టీలు, ఈ బ్రాంచి మేనేజరు ఇప్పించిన బిస్కట్లు తప్ప ఈ రోజు పుడ్డుకు కూడా గడ్డు పరిస్థితి వచ్చింది.

## తెరవండి

లేడీ డాక్టర్ : ఏదీ, మీనోరు తెరవండి. పరీక్ష చేస్తాను.

పేషెంటు : డాక్టరమ్మా, మీరు మీ ఆయన యిలాగ ఎప్పుడయినా ఉంటారా?

లేడీ డాక్టర్ : ఏం. ఎందుకలా అడుగుతున్నారు?

పేషెంటు : ఏం లేదులెండి. మా ఆవిడ ఎప్పుడూ నన్ను నోరు మూసుకో అనే అంటుంది.

కె.సత్యం

(ఏలూరు)


టైము చూసుకున్నాను. నాలుగున్నర. జనరల్ లెడ్జర్, లోన్ డాక్యుమెంట్స్ అన్నీ చూశాను. బ్రాంచి మేనేజరునీ, ఆఫీసర్లనీ తిట్టవలసిన తిట్లన్నీ తిట్టేశాను. ఇంక ఏం తిడదామన్నా బ్రాంచి మేనేజరు చెక్క మొహం పెట్టడం తప్ప చలనం ఏదీ ఉండదు. ఏదైనా తిండి ఏర్పాటు చెయ్యమని అడిగితే ముష్టెత్తుకున్నట్టు ఉంటుంది. నాచేత పిచ్చి తిట్లు తిన్న ఈ బ్రాంచి మేనేజరుకి నా పుడ్డు సంగతి స్పృహలో లేదు. నాకు పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.


బ్రాంచి మేనేజరు తన రూమ్‌లో తాపీగా ఏవో స్టేట్‌మెంట్స్ చెక్ చేసుకుంటున్నాడు. స్టాఫంతా ఒక్కొక్కరే గుడ్ నైట్ చెప్పి చల్లగా జారుకుంటున్నారు. నే నున్నానన్న మొహమాటం కొద్దీ ఆఫీసర్లూ, బ్రాంచి మేనేజరూ ఎవరి సీట్లలో వాళ్లు పనులు చేసుకుంటున్నారు. ఈ పల్లెటూళ్లో స్టాఫ్ మెంబరు ఎవ్వడూ కాపురం ఉండటంలేదు. ప్రస్తుతం అలజడులతో స్తంభించిపోయిన (దగ్గర) పట్నంలో ఉంటూ డైలీ షటిల్ చేస్తున్నారు.

కాసేపు రోడ్డు మీద పచార్లు చేద్దామని బయటికి వచ్చాను. అన్నీ పాత గడపలే! పదిహేనేళ్ల క్రితం డిప్యూటీ మేనేజరుగా ఉన్నప్పుడు ఓ వారం రోజులు స్పెషల్ వర్క్ మీద ఈ బ్రాంచికి వచ్చాను. అప్పుడు ఎలా ఉందో, ఇప్పుడూ అలాగే ఉంది ఈ ఊరి పరిస్థితి. అన్నట్టు ఈ పక్కన దూళ్లపాకలో రాములుంటుండే వాడు. ఎక్కడున్నాడో? ఇప్పుడు కనిపించినా బాగుణ్ణు!

రాములు జ్ఞాపకం వచ్చేసరికి పదిహేనేళ్లనాటి సంగతులన్నీ నా స్మృతిపథంలో మెదిలాయి. సన్నగా, నల్లగా నిగనిగలాడుతూ, చురుకుగా చలాకీగా ఉండేవాడు. ఇక్కడ బ్రాంచి పెట్టక పూర్వం ఈ పాకలో పశువుల్ని కాస్తుండేవాడు. ఈ బ్రాంచి పెట్టిన తర్వాత పశువుల్ని వేరే చోటికి తరలించి, ఈ పాకని టీ కొట్టుగా మార్చాడు. బ్యాంకు స్టాఫ్ అందరికీ కాఫీలు, టీలూ సప్లై చేస్తూ, టిఫిన్లు తెచ్చి పెడుతూ ఉండేవాడు. నేను ఈ ఊళ్లో ఉన్న వారం రోజులూ వాళ్లమ్మ చేత వంట చేయించి కారియర్ కూడా తెచ్చిపెట్టేవాడు. రాములు గురించి అడగడానికి బ్రాంచి మేనేజరు రూమ్ వైపు నడిచాను.

బ్రాంచి మేనేజరు సీట్లోంచి వినయంగా లేచి, "మీ ప్రోగ్రాం ఏమిటి సార్? నైట్‌హాల్ట్ ఎక్కడ ప్లాన్ చేసుకున్నారు?" అని అడిగాడు. నువ్వుంటావా, పోతావా బాబూ అని కసిగా అడుగుతున్నట్టు ఫీలయి, నాలో ఉక్రోషం పొంగు కొచ్చింది. ఒక






రీజినల్ మేనేజరుగా బ్రాంచి మేనేజరుకి లోకువ అవడం నా కిష్టం లేదు. అందుకని నా అధికార దర్పంతో, "ఐ హేవ్ నాటెట్ డిసైడెడ్. ఇఫ్ పాసిబుల్ ఐ మే స్టే హియర్!" అని ఇంగ్లీషులో (ఇక్కడే ఉండిపోతానన్నట్టు) హింట్ ఇచ్చాను.

"ఇక్కడా! ఇక్కడ ఉండటం కష్టం, సార్! మా ఇంటికి వచ్చేయండి. నా స్కూటర్ మీద తీసుకెళ్లిపోతా. మా ఇంట్లోనే ఈ రాత్రికి భోజనం చేసి, రేపు కారు బాగుపడిన తర్వాత మీరు ప్రొసీడవ్వచ్చు."

అతను వినయపూర్వకంగా, నా పట్ల బాధ్యత తీసుకుంటున్నట్టు అంటున్నా, 'నేను తప్ప ఇక నీకు దిక్కు లేదు సుమా!' అన్న హెచ్చరికే అది.

"నో! యూ నీడ్ నాట్ టేక్ ట్రబుల్. ఐ కెన్ ఎరేంజ్ ఫర్ మైసెల్ఫ్" అని బింకంగా, నా గీరంతా ఉట్టిపడేలా అన్నాను.

"ఇటీస్ లెఫ్ట్ టు యు సార్!" (నీ కర్మ!) అనేసి తల దించేసుకున్నాడు.

ఈ బ్రాంచి మేనేజరు ఆహ్వానాన్ని తిరస్కరించినా నాకేం పరవాలేదు. నాకు రాములు జ్ఞాపకం రావడం మంచిదే అయింది. వీళ్లంతా ఇళ్లకు వెళ్లిపోతే నే నొక్కణ్ణే ఉంటాను. డ్రైవరు శీనయ్య - వాడి పుణ్యమాని కారులో నేను సాధారణంగా ఉంచుకునే తలగడా, టర్కీ టవలు, బ్లాంకెట్టు ఇందాక వచ్చినప్పుడు తెచ్చిపడేశాడు. రాములు కోసం వాకబు చేసి భోజనం తెప్పించుకుంటే సరిపోతుంది. ఈ ఆఫీసు బల్ల మీదే ఓ కునుకు లాగేస్తే తెల్లారిపోతుంది. పట్నం నుండి కారు తీసుకురాగానే బయల్దేరి వెళ్లిపోవచ్చు.

'రాములని ఒకతను ఉండాలి. ఏమయ్యాడు?' ' అని అడిగాను.

"వాడు గత ఆర్నెల్ల నుండి ఈ బ్రాంచికి రావడం మానేశాడు, సార్! కాఫీలూ, టీలూ అన్నీ బంద్ చేసేశాడు."

నా మనోగతాన్ని పసికట్టినట్టుగా ఫీల్డాఫీసరు జవాబు చెప్పేసరికి నా గుండెలో ఒక్కసారి రాయి పడింది. వాడున్నాడన్న ధైర్యంతో బ్రాంచి మేనేజరు మాటలను తిరస్కరించాను. ఆ రాముడు దేవుళ్లా కనిపించి ఈ ఒక్కపూట భోజనం పెడితే బాగుండును. కడుపు నకనకలాడిపోతోంది.

నా నిస్సహాయతని పైకి కనపడనీయకుండా వాడి గురించి తెలివిగా ప్రశ్నించాలనుకున్నాను.

"ఎందుకు మానేశాడు? ఈ ఊరొదిలి వెళ్లిపోయాడా?"

"లేదు, సార్! వాడు ఈ ఊళ్లోనే ఉన్నాడు.

## గొప్ప

" ఏరా, రాజూ. మనిషి గొప్ప వాడా? గాడిద గొప్పదా?"

" మనిషే గొప్పవాడు, టీచర్"

"వెరీ గుడ్. ఎందుచేత?"

" మనిషి గాడిద అవగలడు గాని, గాడిద మనిషి కాలేదు కదా"

" ఆ!!!"

వి.వి. సీతారామదాసు
(గుంటూరు)

ఈ దూళ్లపాకని తీసేసి, ఈ స్థలంలో శ్లాబ్ వేసి ఒక హోటల్ పెట్టుకోవడానికి లోన్ అప్లై చేస్తే, ఆ ప్రపోజల్ని మూణ్నెల్లు పెండింగ్ పెట్టి చాలా చాలా క్వొరీలు వేసి వాడి అప్లికేషన్ని తిప్పి పంపేశారు రీజనల్ ఆఫీసులో."

ఫీల్డాఫీసరు అలా చెప్పేసరికి నా గుండె గతుక్కుమంది. నిజానికి ఈ బ్రాంచి నుండి ఏది వచ్చినా పూర్తిగా చూడకుండా, ఎక్కడైనా, ఏదైనా చిన్న తప్పు కనిపించినా, చివరికి కవరు మీద రొండు స్టాంపు లేకపోయినా చీవాట్లు పెడుతూ, నాకున్న అధికార, గీర భాషనంతటినీ ఉపయోగించి, చెత్త ఉత్తరాలు రాసి, ఎవరికీ ఏ సహాయం అందకుండా ఏడిపించిన ఉదంతాలే కానీ, ఈ బ్రాంచికి గానీ, ఇక్కడి ఖాతాదారులకి గానీ నా సహాయం దాదాపు శూన్యమే.

ఈ దిక్కుమాలిన దుక్కిపాలెం గ్రామం నన్ను శపించిందా అనిపించింది. ఈ బ్రాంచి మేనేజరుని 'దేహీ' అని అడిగే కంటే ఓ పదిరూపాయలు పారేసి ఆ రాములు చేత ఏమైనా తెప్పించుకుని తింటే బాగుంటుంది. దేవుళ్లా ఆ రాములు కనిపిస్తే అంతే చాలు.

నా మనస్సులో ఉన్న భావాలన్నీ నాలోనే అణచుకుంటూ, పైకి నిగ్రహం పాటిస్తున్నాను.

"రాముల్ని కబురంపిస్తే ఇప్పుడు రాడా?" అని అడిగాను,

"ఏమో, సార్! ఎక్కడున్నాడో, ఏమో!" ఫీల్డాఫీసరు పెదవి విరిచాడు.

"బెటర్ యు ట్రై!" ఆజ్ఞాపిస్తున్నట్టుగా అభ్యర్థించాను.

"వాడు రాడు, సార్! మన బ్యాంకు మీద చాలా కోపంగా ఉన్నాడు." కచ్చితంగా చెబుతుంటే ఫీల్డాఫీసరు మీద చిరాకు పెరిగిపోయింది నాకు.

"వాటీస్ ది రీజన్?"

"ఏమో సార్! వాడు తన అప్లికేషన్ కోసం మాట్లాడడానికి వస్తే జోనల్ ఆఫీసులో ఎందుకొచ్చా విక్కడికి అని తిట్టిపోశారట!"

అవును. ఓసారి వాడు నన్ను చూడడానికి తలుపు తోసుకుంటూ లోపలికి రాబోయాడు. ఈ బ్రాంచి మీద కోపం కొద్దీ వాణ్ణి చూస్తూనే మండిపడ్డాను. "ఎవడ్రా నిన్నిక్కడికి పంపింది, రాస్కెల్!" అని అరిచాను.

'తమరు తెలుసు కదా అని నేనే వచ్చానండీ!' అన్నాడు.

అయినా తలతిక్కగా "నీ లాంటి వాళ్లని రోజుకు వంద మందిని చూస్తూ ఉంటాను. నువ్వెడివో నాకు తెలియదు, గెటౌట్!" అని

కసురుకున్నాను.

మారు మాట్లాడకుండా వెనక్కి వెళ్లాడు. ఇప్పుడు లీలగా గుర్తొస్తోంది.

★ ★ ★

"సార్! చీకటి పడుతోంది. నా మిసెస్‌కి ఒంట్లో బాగాలేదు. నేను వెడుతున్నాను. మీకు ఏ ఇబ్బందీ ఉండదు, సార్! గుడ్‌నైట్!" బ్రాంచి మేనేజరు ధైర్యం తెచ్చుకుని నేను గుడ్ నైట్ అని తిరిగి చెప్పేలోగానే స్కూటరు స్టార్టు చేసేశాడు. మిగతా ఇద్దరు ఆఫీసర్లు అతన్ని ఫాలో అవుతూ 'గుడ్ నైట్' అనేసి స్కూటర్లు బయటికి పోనిచ్చారు.

హమ్మయ్య! నేనొక్కణ్నీ మిగిలాను. ఎవడితోనూ మొహమాటం లేదు. ఎంత డబ్బైనా ఇచ్చి భోజనం తెప్పించుకోవచ్చు.

టైము చూసుకున్నాను. ఏడున్నర. ఊరంతా నిశ్శబ్దంగా ఉంది. అరకొర వెలుగులతో ఇళ్లన్నీ మసకమసకగా కనబడుతున్నాయి. ఎవడో అప్పుడే బస్సు దిగినట్టున్నాడు. ఒక్కడూ నడుచుకుంటూ వస్తున్నాడు.

"బాబూ! ఓ సారి ఇటు రా!" అని పిలిచాను.

వాడు దగ్గరగా వచ్చాడు. "ఈ బ్యాంకుకి దగ్గర్లో... రాములనీ ..." అని అడిగేలోగానే, "ఈ బ్యాంకోళ్లకి టీలూ గట్రా ఇచ్చేవోడేనాండీ? ఆ డిప్పుడే కలిసేడండి. ఈ బ్యాంకుకి ఎవరో పెద్దాయన వచ్చారని ఆడే సెప్పాడండి. తమరే నన్న మాట" అంటూ గబగబ మాట్లాడేశాడు.

నా ప్రాణం కుదుటపడింది.

"నీకు పుణ్యముంటుంది. నేను రమ్మన్నానని చెప్పు" అన్నాను.

"ఆడితో ఏంటండీ పని? అసలే బ్యాంకంటే మండిపడుతున్నాడు" అన్నాడు. నా మనస్సు చివుక్కుమంది.

"ఏం లేదు. నే చెప్పానని చెప్పి కాస్త భోజనాన్ని కారియర్లో పెట్టి పంపించమను."

"అలాగేనండి" అంటూ వెళ్లిపోయాడు.

ఏదో టైముకి భోజనం వస్తుందన్న ఆశ చిగురించింది నాలో.

★ ★ ★

ఓ చిన్న కుర్రాడు - పది పన్నెండేళ్ల పసివాడు ఓ బరువైన కారియర్‌ని మొయ్యలేక మొయ్యలేక నానా అవస్థా పడుతూ తెచ్చి టేబుల్ మీద పెట్టాడు.

"మా నాన్న ఇక్కడిచ్చి రమ్మన్నాడండి!" అంటూ, వాడు బరువు దించుకున్న ఆనందంతో తుర్రుమంటూ పరుగెత్తాడు.

పప్పూ, కొబ్బరి పచ్చడి, గుమ్మడి ముక్కల పులుసూ, గడ్డ పెరుగు, గిన్నె నిండుగా అన్నం చూసేసరికి నాకు ప్రాణం లేచి వచ్చింది. తృప్తిగా భోజనం చేశాను. పొద్దుట నుంచి ఉన్న ఆకలి మంట ఉపశమనం పొందింది. మనస్సు కుదుటపడింది. పేపరు తీసి చూస్తున్నాను. ఓ అర గంట గడిచాక, ఓ నలభై ఏళ్ల మనిషి వచ్చాడు. టేబిలు మీద వరచిన ఖాళీ గిన్నెలని తీసుకుంటున్నాడు. అతన్ని గుర్తుపట్టాను. ఆ రోజు గెటౌట్ అని తిట్టి మాట్లాడడానికి అవకాశం లేకుండా వెనక్కి పంపింది ఇతన్నే. కచ్చితంగా ఇతనే రాములు!

అతను పెట్టిన భోజనం తిని పలుకరించకపోతే బాగుండదని, "ఏం రాములూ, బాగున్నావా?" అని అడిగాను.

మౌనంగా కారియర్ సర్దుకున్నాడు. వాడికి మాట్లాడడం ఇష్టం లేదని గ్రహించాను. ఏదో విధంగా మాట్లాడించాలనుకున్నాను.

"నీ లోన్ అప్లికేషన్ ..."

"అదెప్పుడో మా గేదె తాగే కుడితిలో కలిపేశానండి. దాని ఊసెత్తకండి!" కాస్త రోషంగానే అన్నాడు.

'ఇదిగో, ఈ కారియర్‌కి డబ్బులు తీసుకో!' పది రూపాయల నోటు అందివ్వబోయాను. వాడు పుచ్చుకోకుండా వెనక్కి జరిగాడు.

"పరవాలేదు, తీసుకోవోయ్!" అన్నాను సౌమ్యంగా.

"నేను కారేజీ పట్టుకెళ్లడాని కొచ్చానండి, డబ్బు కోసం కాదు."

ముందుకు నడిచాడు గబగబా అడుగులు వేస్తూ.

వాడి వెనకాలే రెండడుగులు నేనూ వేశాను. "నువ్విలా డబ్బు పుచ్చుకోవని తెలిస్తే ఈ కారేజీ పంపమని అడిగి ఉండేవాణ్నే కాదు."

"ఆకలి అందరికీ ఒకటే, బాబూ! దాన్ని కనిపెట్టి ఉపకారం సేసే వోడే గొప్పోడు. తమకు గొప్ప అధికారం ఉండి, సేతనైన సాయం సేయగలిగీ నాకు అన్నం పెట్టలేకపోయారు. నాకు సదువు నేకపోయినా, ఉజ్జోగం నేకపోయినా మీకు అన్నం పెట్టాను. మీ ఊరొస్తే పురుగుని సూసినట్టు సూసారు, కసురుకున్నారు. అట్టా సేయడం మాకు సేతకాదు. అదేనండి మీకూ, మాకూ తేడా!"

కేరేజీ పట్టుకుని గబగబ బయటకు నిష్క్రమించి, ఆ చీకట్లో కలిసిపోయాడు రాములు.

ఆవరించిన చీకటి మీద పగ తీర్చుకుంటున్న వెలుగులా కనిపిస్తుంటే - వాడు వెళ్లిన వైపే మ్రాన్పడిపోయి చూస్తూ ఉండిపోయాను.

●

## అతివృష్టి, అనావృష్టి

"అతివృష్టి, అనావృష్టి అంటే ఏంటి నాన్న? అడిగాడు కొడుకు.

"మీ అమ్మ చీరల బిల్లు అతివృష్టి. నీ ప్రోగ్రెస్ కార్డు అనావృష్టి" వివరించాడు తండ్రి.

పి. సరోజ (అమలాపురం)

